

బాలికను పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి తెస్తున్న వ్యక్తి అరెస్ట్



దేవరుప్పుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకోవాలని చూసిన వ్యక్తిని ఆదివారం దేవరుప్పుల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం బోడబండా తండాకు చెందిన బాలికను అదే తండాకు చెందిన ధరావత్ యాకూ పెళ్లి చేసుకుంటాననీ మాయమాటలు చెప్పి మోసం చేయాలని చూశాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



కలిసుందాం.. రా..!

ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఐక్యతారాగం

- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్‌కు తాత్కాలిక తెర
- మంత్రి కొండా సురేఖతో కలిసిపోతున్న ఎమ్మెల్యేలు
- సురేఖపై ఇటీవలే అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన శాసనసభ్యులు
- రేపటి సీఎం సభ ఏర్పాట్లలో అందరూ బిజీబిజీ
- విభేదాలను పక్కన పెట్టడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఐక్యతరాగం వినిపిస్తోంది. నిన్నటి వరకు మంత్రి సురేఖపై ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేసిన సంఘటనలున్నాయి. అలాగే ఎమ్మెల్యేల తీరుపై మంత్రి గుర్రుగా ఉన్న విషయాన్ని చూశాం. ఇలా వీళ్ల మధ్య కొన్నాళ్లుగా ఉప్పు, నిప్పులా చిటపటలే వినిపించాయి. అయితే సీఎం విజయోత్సవ సభ నేపథ్యంలో వీరంతా కలిసినట్టే కనిపిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి పర్యటనలో కనిపించిన ఐక్యత.. సీఎం సభ ఏర్పాట్లలోనూ కలిసి పని చేస్తుండటంతో కాంగ్రెస్‌లో వర్గవిభేదాలకు ఇక ఫుల్ స్టాప్ పడ్డట్టే అనే చర్చ క్యాడర్‌లో జోరుగా సాగుతోంది. అంతేకాదు.. సీఎంకు దూరంగా ఉంటూ టీపీసీసీ అధ్యక్షుడి పర్యటనలో కనిపించని నర్సంపేట ఎమ్మెల్యే సైతం సీఎం సభకు పదివేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించటం హస్తంలో అసమ్మతి దారికి వస్తుందనే చర్చ జరుగుతోంది.

కొన్నాళ్లుగా విభేదాలు

ఓరుగల్లు కాంగ్రెస్‌లో తొలి నుంచి విభేదాలు, వర్గపోరుతో కేడర్ సతమతమైంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటులో ఇద్దరు మహిళలకు ఉమ్మడి వరంగల్ నుంచి మంత్రులకు అవకాశం దక్కింది. అయితే ఇద్దరు మంత్రుల మధ్య సయోధ్య లేదనే ప్రచారం జరిగింది. 2024 ఫిబ్రవరిలో జరిగిన మేడారం మహాజాతర నుంచే వీరి మధ్య విభేదాలు పొడచూపాయనే ప్రచారం ఉంది. మేడారం జాతర పనుల్లో అటవీ, దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సురేఖ పూర్తిస్థాయిలో పాల్గొనకపోడటంతో ఇద్దరు మంత్రులు మధ్య విభేదాలే అనే చర్చ జరిగింది. ఆ తరువాత వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జిగా ఉన్న సురేఖను మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జిగా అధిష్ఠానం పంపించటంపై కూడా కొండా వర్గీయుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఆ తరువాత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో విభేదాల ఆడియో లీక్ కావటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేదనే చర్చ వినబడింది. దసరా మరుసటి రోజు గీసుకొండలో ఫ్లెక్సీల లొల్లి కాంగ్రెస్‌లో వర్గవిభేదాలను తారస్థాయికి చేర్చాయి. గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో సురేఖ హంగామాతో కొండా, రేవూరి మధ్య మరింతా గ్యాప్ పెరిగింది. వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలోని ఐనవోలు, భద్రాకాళి ఆలయ కమిటీల్లో తమకు సమాచారం లేకుండానే మంత్రి కమిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యేలు అసంతృప్తికి లోనయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదారుగురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌మున్షీకి కూడా సురేఖ తీరుపై ఫిర్యాదు చేశారు. ఇంతలా విభేదాలతో అట్టుడికిన ఓరుగల్లు కాంగ్రెస్‌లో నేతల మధ్య ఐక్యతారాగం శ్రేణులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

కాంగ్రెస్ నేతల్లో ఇటీవలకాలంలో కనిపిస్తున్న ఐక్యత శ్రేణుల్లో జోష్ నింపుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కొన్నాళ్లుగా ఉన్న విభేదాలను పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారిస్తుండడం కేడర్‌ను ఉత్సాహపరుస్తోంది. ఢిల్లీకి వెళ్లి మంత్రి సురేఖపై ఫిర్యాదు చేయాలని ప్రయత్నించిన ఎమ్మెల్యేలు కూడా మంత్రితో కలిసి పనిచేస్తుండటం హస్తం పార్టీలో హట్‌టాపిక్‌గా మారింది. తొలి నుంచి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో ఉన్న విభేదాలను పక్కన పెట్టి మంత్రి సురేఖ మామునూరు ఎయిర్‌పోర్టు పరిశీలనతో పాటు సంగెం మండలం పరిధిలోని రైతులతో భూసేకరణపై చర్చించి, ఒప్పించటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖ తనకు ఆదర్శం అంటూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఎక్స్ వేదికగా ప్రకటించటం.. సురేఖతో కలిసి దిగిన ఫోటోలు షేర్ చేయటం హస్తం నేతల్లో ఐక్యత చిగురించిందటనే టాక్ వినబడింది. ఆదివారం మంత్రులు సురేఖ, సీతక్కలు కలిసి సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించటం, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పర్యటనలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి పరస్పరం ఎదురెళ్లి నమస్కారం చేయటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కూడా అందరితో కలిసి వెళుతుండటం కాంగ్రెస్ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక మొదటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి దూరంగా ఉన్నారనే ఆరోపణలున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వరంగల్ పర్యటనకు కూడా దూరంగా ఉండటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. గత జూన్ 29న జరిగిన సీఎం పర్యటనకు కూడా స్థానికంగా ఉండి మాధవరెడ్డి హాజరుకాలేదు. అయితే ఆదివారం సీఎం సభకు నర్సంపేట నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలిస్తామని, అందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించటం కాంగ్రెస్‌లో విభేదాలకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పడిందనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్

అభివృద్ధికి ఆటంకంగా అసమ్మతి

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయలేని అభివృద్ధి పనులన్నింటినీ పూర్తిచేసేలా కార్యాచరణ చేశారు. ఇందులో ప్రధానంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుపై దృష్టి పెట్టారు. దక్షిణ కొరియాకు వెళ్లి పెట్టుబడులు తీసుకువస్తున్నారు. టెక్స్ టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు అక్కడే 836 మందికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించేలా మంగళవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. వీటితో పాటు కాళోజీ కళాక్షేత్రానికి రూ.45కోట్లు

మిగతా 6వ పేజీలో

అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తా

- సాక్ష్యాలతో బయటపెడతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా..
- రాజయ్య 'దళితబంధు' మోసాలను నిరూపిస్తా..
- మరి ఆయన రాజీనామా చేస్తాడా..
- 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఎకరం భూమి కబ్జా చేయలే..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాను అవినీతి, భూ కబ్జాలకు పాల్పడినట్టు మాజీ ఎమ్మెల్యే రాజయ్య నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారం ఘన్‌పూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజయ్య నిరూపించని పక్షంలో ఆయన దళితబంధు పేరుతో వందలాదిమంది పేద, దళిత బిడ్డలను ఏవిధంగా మోసం చేశావో సాక్షాలతో ప్రజలు, మీడియా ముందు నిరూపిస్తానని తెలిపారు. నిరూపించిన వెంటనే రాజయ్య రాజకీయాల నుంచి తప్పుకుంటావా, ఏమాత్రం ధైర్యం ఉన్న తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని తెలిపారు. రెట్టింపు అభివృద్ధి చేసి తన మార్కు చూపిస్తానన్నారు.

ఆరు పనులకు సీఎం ఆమోదం

నియోజకవర్గ అభివృద్ధికి పది ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఆరు ప్రతిపాదనలకు సీఎం మంజూరు ఇచ్చారని కడియం వెల్లడించారు. వాటిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులం, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీసెస్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంజూరి ఇచ్చిందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. మల్లన్న ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను జూన్‌లో పూర్తి చేసి గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు. రఘునాథపల్లి, వేలేరు మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, చిలుపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.300 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

ఈనెల 19న సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో

మిగతా 8వ పేజీలో...

కాంప్లెక్స్‌కు రూ.26 కోట్లు మంజూరు



స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజినల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరి చేస్తూ ఆదివారం జీవో జారీ చేసింది. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్‌గా మారినా ప్రభుత్వ కార్యాలయాలకు సరైన భవనాలు లేక ప్రైవేట్ భవనాలలో నడుస్తున్నాయని సంబంధిత అంశం ఎమ్మెల్యే కడియం దృష్టికి రావడంతో నియోజకవర్గ కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను నిర్మించి సమీకృత కలెక్టర్ కార్యాలయంలా నిర్మించేందుకు అధికారులకు గత కొన్ని నెలల క్రితం ఆదేశాలు జారీచేశారు. అధికారులు ప్రస్తుతం ఉన్న ఎంపీడీవో కార్యాలయంను కలుపుకొని 2.35 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఎమ్మెల్యేకు నివేదిక అందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారు. కాంప్లెక్స్‌లో 16 ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి దినపత్రిక
వరంగల్ డెస్క్‌లో పనిచేయడానికి
అనుభవం కలిగిన గ్రాఫిక్ డిజైనర్లు కావాలి

- ఇంటర్/డిగ్రీ పాసై ఉండాలి. వయస్సు 45 ఏళ్ల లోపు ఉండాలి.
- తెలుగు భాషపై కొంత పట్టు ఉండాలి.
- ఏదైనా ప్రముఖ పత్రిక జిల్లా డెస్క్‌లో కనీసం ఐదేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- తెలుగు టైపింగ్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్, అడోబ్ ఫొటోషాప్‌లో నైపుణ్యం ఉండాలి.
- అనుభవం, అర్హతల ప్రాతిపదికన వేతనం ఉంటుంది.

మీ ఫొటో, పూర్తి బయోడేటా, గతానుభవం తాలూకు వివరాలతో హాజరు కండి

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ: 19.11.2024
సమయం: మధ్యాహ్నం 3.00 గంటలకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
9912381592, 9985411341

చిరునామా : ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం, మడికొండ.

సజావుగా గ్రూప్-3 పరీక్షలు షురూ

- గేట్లు మూసివేతతో వెనుదిరిగిన అభ్యర్థులు
- జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు
- వికలాంగ అభ్యర్థులకు కానరాని ఏర్పాట్లు
- తొలిరోజు 57 శాతం అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్


జనగామలో నంబర్లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు

జనగామ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1364 పోస్టుల భర్తీకి గాను ఏప్రిల్‌లో గ్రూప్-3 పరీక్ష నోటిఫికేషన్ జారీ చేయగా పరీక్షల నిర్వహణకు ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల సందర్భంగా బయోమెట్రిక్ నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించినా అధిక సంఖ్యలో అభ్యర్థులు పలు కారణాలతో పరీక్ష రాయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. ఉదయం సెషన్‌లో 57.28శాతం అభ్యర్థులు హాజరు కాగా మధ్యాహ్నం సెషన్‌కు 57.05 శాతం హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ సందర్శించారు.

గేట్ల మూసివేతతో ఇక్కట్లు

పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తామని అధికారులు వారం రోజుల క్రితమే ప్రకటించారు. ఈ విషయమై హాల్‌టికెట్‌పై నియమ నిబంధనలు కూడా ముద్రించారు. కానీ గమనించని అభ్యర్థులు గతంలో మాదిరిగా ఒక్క నిమిషం నిబంధననే గుర్తు పెట్టుకొని పరీక్ష సమయానికి నిమిషం ముందు వరకూ కేంద్రాలకు వస్తూ పోయారు. నిర్వాహకులు అనుమతించకపోవడంతో అనేక మంది అభ్యర్థులు వెనుదిరిగిపోయారు.

హాల్‌టికెట్‌పై ఫొటో లేకపోవడంతో..

పరీక్షార్థులు హాల్ టికెట్‌ను ఏ-4 సైజు పేపర్‌పై కలర్ ప్రింట్ తీసుకొని దానిపై తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటో అతికించాలి. అయితే విషయం గమనించని అభ్యర్థులు హాల్ టికెట్ తీసుకొని ఫొటో లేకుండా రావడంతో అధికారులు అనుమతించ లేదు. దీంతో ఫొటో కోసం పట్టణానికి చేరుకొని ఫొటో దిగి పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని వచ్చేసరికి పుణ్యకాలం కాస్తా ముగిసింది. దీంతో అధికారులు సమయం ముగిసిందని అనుమతించకపోవడంతో అవకాశాన్ని అభ్యర్థులు చేజార్చుకోవాల్సి వచ్చింది.


జనగామలో ఏబీవీ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వికలాంగులకు లేని ఏర్పాట్లు

గ్రూప్-3 పరీక్షల నిర్వహణలో వికలాంగులకు అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. రెండు కాళ్లు లేని అభ్యర్థులు, చేయి, కన్ను లేని అభ్యర్థులు కేంద్రాలకు రాగా వీల్ చైర్ లేదా ఇతర ఏర్పాట్లు లేని కారణంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ విషయమై ప్రత్యేకాధికారి జితేందర్‌రెడ్డి కేంద్రాల సీఎస్, డీవోలకు సూచనలు చేసినప్పటికీ నిర్వాహకులు

మిగతా 8వ పేజీలో...

విజయోత్సవ సభను జయప్రదం చేయండి

- కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు..
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- మూటలు మోసే అలవాటు బీఆర్ఎస్‌కే ఉంది.. : మంత్రి సీతక్క

హనుమకొండ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరిగే కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రజాపాలనకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని ఆదివారం మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. సభ ఏర్పాట్లను చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలన ముగియడంతో ఏడాదిగా రాష్ట్రంలోని అన్నివర్గాలు ఆనందంగా ఉన్నాయన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 19న జరిగే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

సభ నిర్వహణ ద్వారా మరింత అంకితభావంతో తాము ప్రజలు సేవ చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు. స్వయం సంఘాలకు వడ్డీ లేని రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపుతూ ఆనాటి ఇందిరమ్మ సంక్షేమ పాలనను మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో వెల్లడిస్తారన్నారు.

మూటలు మోసే అలవాటు బీఆర్ఎస్‌కే ఉంది..

మూటలు మోసే అలవాటు

మిగతా 8వ పేజీలో...

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని వారి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీలను నేరవేర్చక సతమతమవుతోందన్నారు. ముఖ్యంగా రైతన్నలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ,

మిగతా 8వ పేజీలో...

జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు రామన్నగూడెం విద్యార్థినుల ఎంపిక


సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన రక్షిత, మైథిలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రక్షిత, మైథిలి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని ఆదివారం తెలిపారు. డిసెంబరు 16 నుంచి 21 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి సైన్స్‌ఫె యిర్‌లో వారు పాల్గొననున్నారని పేర్కొన్నారు. వీరు రూపొందించిన 'ఇంటెలిజెంట్ ఆల్కహాల్ డిటెక్షన్ వెహికల్ అలర్ట్ సిస్టం ఫర్ డ్రైవర్స్' ఎగ్జిబిట్ జాతీయస్థాయికి ఎంపికైందని అన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

బీసీ ఆజాదీ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గే

భూపాలపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ ఆజాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గే కోరారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో టీవీవీ జిల్లా అధ్యక్షుడు రాదండి దేవేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో కుమార్‌గాడ్గే మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర కులగణన కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టాలనే డిమాండ్‌తో ఈ బస్సుయాత్రను చేపట్టినట్లు తెలిపారు.

డిసెంబరు 9, 10, 11 తేదీల్లో ఈ బస్సు యాత్ర ఉంటుందన్నారు. బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారంలో కూడా వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాదాసి సురేష్, భిక్షపతి, శ్రీనివాస్, రమేష్, కవిత, మంగ తదితరులు పాల్గొన్నారు.

కలిసుందాం.. రా..!

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసి పనులన్నీ పూర్తి చేయించారు. తాజాగా మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి కావాల్సిన 253 ఎకరాల భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.205కోట్ల నిధులను ఆదివారం మంజూరు చేసింది. 2050 వరకు వరంగల్ నగరానికి కొత్త మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం, ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇలా వరంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ చేస్తుంటే.. ఓరుగల్లు నేతల మధ్య విభేదాలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేయటం చికాకుగా మారటంతో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకున్నారనే చర్చ జరుగుతోంది.

మంత్రి సురేఖతో పాటు ఓరుగల్లు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతం మాట్లాడినట్లు తెలుస్తోంది. ఏ సమస్య ఉన్నా.. తన వద్దకు రావాలని, రచ్చకెక్కవద్దని సూచించినట్లుగా తెలిసింది. మీ నియోజకవర్గాల అభివృద్ధి, పార్టీ కోసం, మీ గెలుపు కోసం పని చేసిన కేడర్‌ను కాపాడుకునేందుకు కావాల్సిన వాటిపై దృష్టి పెట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సైతం సూచించినట్లుగా తెలిసింది. దీంతో పాటు కాంగ్రెస్ పాలనకు ఏడాది కావస్తుండటంతో అసమ్మతి రాగాలు వినిపించటం మంచిది కాదనే చర్చ పార్టీలో జరిగినట్లుగా సమాచారం. దీంతో తాత్కాలికంగానైనా విభేదాలు పక్కన పెట్టి నేతలు, ఎమ్మెల్యేలు కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావటంతో పాటు విజయోత్సవాలను విజయవంతం చేసేందుకు ఐక్యతగా ముందుకు సాగుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ ఐక్యత తాత్కాలికమా.. శాశ్వతమా.. అనేది పక్కన పెడితే.. చాలా రోజులకు ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఐక్యత కనిపించటం మాత్రం కేడర్‌లో జోష్‌లో ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి Classifieds

WANTED
★ Wanted Social Teacher to Teach 7th to 10th Class 4 Periods. ST THERESA SCHOOL NEKKONDA.Cell 8801802586, 9397696550 8
AJW-199417

WANTED
★ Wanted Additional Faculty for Following Subjects Computer Science, Commerce and Management,Physics, Chemistry, Sanskrit. Non-Teaching Computer Lab Instructor. Cell : 9676481370
AJW-199481

WANTED TELECALLERS
★ Urgent Requirement for ICICI, HDFC, AXIS, INDUSIND BANK'S, DSA Personal Loans Experience And Fresher Female Tele-Callers Salary+Incentives Job Location Hanamkonda, Contact : 9398286149
AJW-7624

WANTED HINDI TEACHER
★ High School Hindi Teacher Wanted New Vision School Near Girnibavi(Vill), Laknepally (Mdl), NarsamPet. Cell : 9550633624, 9849464761.
AJW-199416

WANTED
★ Bhavani Khara లో పనిచేయుటకు Security Guards కావలెను. 8498058893. Phone Call Timings : 10am to 6pm
AJW-199460

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, మరియు సూపర్ వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8గం॥, 12గం॥ల డ్యూటీలు కలవు. జీతం : 12000 - 14000. సం॥ప్ర॥ 8688072125
AJW-199402

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ WGL TAXTIAL PARK నందు మరియు ఇతర Show Room Apartments నందు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలయును. జీతం : 10,000/- నుండి 15,000/- + ESI,EPF ఉచిత రూము + క్యాంటీన్ సౌకర్యం కలదు. సం॥ప్ర॥ 8978459111, 6309922608.
AJW-453

HOUSE FOR SALE
★ హన్మకొండ, సుబేదారిలో G+1, G+1 పోర్షన్స్ 260 Sq.Yards 3Cr APT at Subedhari & Siddhartha Nagar Cont : 9849745467
AJW-199459

BUILDING FOR RENT
★ 3 Floors Buiding for rent, each floor has 3600 Sqft Ground floor for parking place available, Opp: ASM Degree & PG Womens College, Fort Road Warangal. Cell.No. 9849987808, 8309884828.
AJW-17372

TO-LET
★ వరంగల్ పాత బీట్ బజార్ ఫ్లైఓవర్ పిల్లర్ నెం-6 దగ్గర అన్ని వసతులు గల ఫ్యామిలీ పోర్షన్ 1st ఫ్లోర్ కిరాయికి ఇవ్వబడును. సం॥ప్ర॥ 9849404363
AJW-226260

TO-LET
★ వరంగల్ పాత బీట్ బజార్ ఫ్లైఓవర్ పిల్లర్ నెం-6 దగ్గర, 2 షెట్టర్లు గల 600 Sft గలది. ఎద్దైనా గోదాములకు కిరాయికి ఇవ్వబడును. సం॥ప్ర॥9849404363.
AJW-226259

సిద్ధి వినాయక వాటర్ ప్రూఫింగ్
★ వాటర్ ప్రూఫింగ్: స్లాబ్, బాత్ రూమ్స్, సైడ్ గోడలు, క్రాకులు, చెమ్మలు, వాటర్ ట్యాంక్స్ టెర్రస్ ఏ బిల్డింగ్ లీకేజ్ అయినా ఇంజనీరింగ్ పర్యవేక్షణలో బ్రాండెడ్ కెమికల్స్ ద్వారా 10 సం, గ్యారంటీతో చేయబడును. సెల్:- 7989775119
AJH-002880

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013, 8978510273
వరంగల్ 9985406150, 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

3+2 స్కీం కలదు

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- విద్యార్థుల మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులు
- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్
- మండల విద్యాశాఖాధికారులకు సన్మానం


ఎంఈవోలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు అని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా రంగానికి తెలంగాణ సర్కార్ పెద్దపీట వేస్తుందని, ప్రభుత్వ పాఠశా లల బలోపేతానికి మండల విద్యాధికారులను నియమించిందని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండకుండా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందన్నారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజబాను చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న వంట నిర్వాహకుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గెజిటెడ్ హెచ్‌ఎంకు వెంటనే సర్వీస్ రూల్స్ వర్తింపచేసి పదోన్నతులు ఇప్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఇటీవల మండల విద్యాధికారులుగా బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహిస్తున్న ఎంఈవోలను ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ లచ్చిరాం నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మందుల శ్రీరాములు, తుమ్మ వెంక టేశ్వర్లు, ఎస్. వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, బాలాజీ, అనితదేవి, పూల్‌చంద్, శ్రీదేవి పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది..

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఆదివారం మానుకోట కరాటే అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి షోటోఖాన్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న కురవి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ క్రీడాకారిణులకు ట్రోఫీని అందజేశారు. జిల్లా కేంద్రంలోని మానుకోట కరాటే అకాడమీ ఛైర్మన్ వీరునాయక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో 400 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు మానుకోట కరాటే అకాడమీ ఛైర్మన్ వీరునాయక్ తెలిపారు. ఈ పోటీలకు షోటోఖాన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏరుగొండ చంద్రశేఖర్, కరాటే కోచ్ పాయం సురేష్, సీనియర్ కరాటే మాస్టర్లు కాసిం షేక్, గఫూర్, బాపురావులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

108 సేవలను బలోపేతం చేస్తున్నాం

వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ

మహదేవపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గుండెపోటు రోగిని మధ్యలో వదిలేసి వెళ్లిన 108 డ్రైవర్ సంఘటనపై మంత్రి ఆదివారం స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జరిగిన ఘటనపై 108 సీవోవో ఖాలిద్‌ను విచారణకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. 108 సేవలను మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. మిషన్ ఆఫ్ సేవింగ్ లైఫ్ లో భాగంగా అత్యల్ప సమయంలో ఘటనా స్థలానికి వేగంగా చేరుకుని ప్రథమ చికిత్స అందించేలా 108 సేవలు పనిచేస్తాయని వివరించారు.

అమరుల ఆశయాలు సాధించుకోవాలి

అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క


రైతుకూలీ సంఘం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విమలక్క, నాయకులు

ములుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఉద్యమాల్లో అమరులైన వారి ఆశయాలను సాధించుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. పీడీఎస్‌యూ పూర్వ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 50వసంతాల వేడుక ఆదివారం ములుగులో జరిగింది. విద్యార్థి అమరులను ఈసందర్భంగా స్మరించుకున్నారు. జార్జిరె డ్డి స్మారక స్థూపానికి నివాళులు అర్పించారు. అంతకు ముందు ములుగు లోని జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు ఒక్కతాటిపైకి రావాలని, శాస్త్రీయ విద్యావిధానం కోసం పనిచేయాలని అన్నారు.

ములుగు పోరాటాల గడ్డ అని, అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా ఉద్యమించాలని కోరారు. అనంతరం రైతుకూలీ సంఘం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మాజీ ప్రొఫెసర్ వెంకటనారాయణ, నాయకులు ముంజాల భిక్షపతి, పెండెం రాజేందర్, యుగేందర్, వైనాల రవి, ధనసరి సూర్య, సమ్మయ్య, నర్సయ్య, తీగల జీవన్, అల్లం ఓదెలు, అప్పారావు, కొత్తపల్లి రవి, వెంకటరెడ్డి, నరసింహ, మధు, నాగరాజు, గుండెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు
- తొర్రూరు ఆర్డీవో గణేష్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తొర్రూరు ఆర్డీవో గణేష్

పెద్దవంగర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తొర్రూరు ఆర్డీవో గణేష్ అన్నారు. ఆదివారం మానుకోట జిల్లా పెద్దవంగల మండల కేంద్రంలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రైతులు 17శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకు రావాలన్నారు. ప్రతీ సెంటర్‌కు టార్పాలిన్లను, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరయ్యే గన్నీ సంచుల వివరాలను ముందస్తుగానే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. నిర్వహకులు నిబంధనలకు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరంగటి మహేందర్, ఏవో స్వామినాయక్, ఆర్ఐ లష్కర్, సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

హాజరైన 118 జంటలు


తులసీ కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కేసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ధన్నసరి అటవీశాఖ పరిశోధన కేంద్రంలోని ఉసిరి వనంలో ఆదివారం సాయిదుర్గ కుటీరంలోని 18 మంది అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. గుడి అనంతరామయ్య మంత్రోచ్చారణమధ్య పూజారులు ఈ పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా ఉసిరి, తులసిచెట్లకు తులసీ కల్యాణం తొలుత నిర్వహించగా ఇందులో 30 జంటలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో 118 జంటలు పాల్గొన్నాయి. వ్రతపూజల అనంతరం 600 మందికి అన్నప్రసాదం అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

న్యాశాయంపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అపార్ట్‌మెంట్ వాసులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరువంగం ప్రభాకర్, శ్రీధర్, యాకయ్య, విష్ణువర్ధన్, సంపత్‌రావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో భక్తజన సందోహం

నాలుగో రోజు కనుల పండువగా బుగులోని జాతర


పూజలు చేస్తున్న అర్చకుడు


చెట్ల నీడన విందు చేసుకుంటున్న భక్తులు

రేగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమలగిరి కొండలు భక్తజన సందోహంతో నిండిపోయాయి. పరిసరాలన్నీ గోవిందనామస్మరణ మార్మోగాయి. బుగులోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. బంధు మిత్రులతో కలిసి వచ్చి స్వామి జాతరలో ఆందోత్సాహాల మధ్య పాల్గొన్నారు.

పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ..

బుగులోని వెంకటేశ్వరస్వామికి అర్చకులు వెంకటేశ్వర్లు ఉదయాన్నే ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు, పిల్లలు ఉత్సాహంగా కొండ పైన ఉన్న గండం దీపం వద్దకు చేరుకుని నూనెపోసి దీపాలు వెలిగించారు. చుట్టూ ఉన్న కొండలు, పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ జాతరను తిలకిస్తూ పరవశించిపోయారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెంకటస్వామి, ఈవో శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఎస్సై సందీప్‌కుమార్ నేతృత్వంలో పోలీసులకు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో జాతరలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రైతుల భూములు లాక్కోవడం అప్రజాస్వామ్యం

ఎంసీపీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం లగచర్ల, పులిచర్లకుంట, రోటిబండ తండాల్లో రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం అప్రజాస్వామికమని ఎంసీపీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి అన్నారు. గూడూరు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణపై నిర్వహిం చిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులకు, భూములు కోల్పోయే రైతులకు మధ్య జరిగిన ఘటనను రాజకీయ కోణంలో చూడొద్దన్నారు. రైతుల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. తమ భూములు కోల్పోతున్నామని ఆవేదనతో ఆ సంఘటన చోటు చేసుకుందని దీనికి అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం ద్వార సమస్య పక్కదారి పట్టే అవకాశం ఉందన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయాలనే ఉద్దేశం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఏ ఒక్కటీ అమలు కావడం లేదని మండిపడ్డారు. అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలతో పాటు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నూకల ఉపేందర్, జిల్లా నాయకులు బందెల వీరస్వామి, బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

కందగిరి ఆలయంలో దేవుళ్ల చిత్రపటాలు మాయం


స్వామి చిత్రపటాలు లేక ఖాళీగా కనిపిస్తున్న దృశ్యం

కురవి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం కందికొండ కందగిరి పర్వతంపై ఆలయంలో శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి-లక్ష్మీదేవిల చిత్రపటాలు మాయమ య్యాయి. కార్తీక పౌర్ణమి రోజున కందగిరి పర్వ తంపై అఖండ దీపం వెలిగించిన అనంతరం గ్రామస్తులంతా గుట్టపై నుంచి శుక్రవారం రాత్రి కిందకు దిగారు. ఈ అఖండ దీపం మూడురోజుల పాటు వెలిగిస్తారు. రెండో రోజు సాయంత్రం అఖండ దీపం వెలిగించేందుకు శని వారం సాయంత్రం బండి వెంకన్న, మరికొం దరు గుట్టపైకి ఎక్కారు. ఆలయంలో దేవుళ్ల చిత్రపటాలు లేకపోవడంతో ఎవరైన దొంగిలి ంచి ఎత్తుకువెళ్లారని భావించారు. ఆలయ నిర్వాహకులు జంగాల భాస్కర్, గ్రామ పెద్దలు కలిసి స్వామివారి నూతన చిత్రపటాలను ఆదివారం ప్రతిష్ఠించారు.

ఎన్నికల్లో సీపీఐ జెండా ఎగురవేయాలి

మమబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి


సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్ టౌన్,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో సీపీఐ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌పట్టణంలోని భద్రన్న కాలనీలో మునిసిపల్ 9, 23, 24 వార్డుల సీపీఐ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఆదివారం చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విజయసారథి మాట్లాడుతూ... మహబూబాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో నిత్యం ప్రజల పక్షాన పోరాడే సీపీఐని మెజార్టీ వార్డుల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు సీపీఐ శ్రేణులు సన్నద్ధం కావాలని చెప్పారు. గతంలో సీపీఐ గెలిచిన వార్డుల్లో అనునిత్యం అభివృద్దే లక్ష్యంగా కౌన్సిలర్లు పనిచేసి ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

మునిసి పల్ ఎన్నికల్లో సీపీఐకి మెజార్టీ స్థానాలు వస్తే మానుకోటను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, రవీందర్, యాకమ్మ, మహమూద్, పద్మ, మహేష్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పర్సు పోగొట్టుకున్న మహిళ

ఆర్టీసీ సిబ్బంది అందజేత

మహబూబాబాద్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో ఓ మహిళా తన పర్సును పోగొట్టుకుంది. తోటి ప్రయాణికులు దానిని గుర్తించి సదరు బస్ డ్రైవర్, కండక్టర్‌కు అప్పగించగా వారు ఆ పర్సును పోగొట్టుకున్న మహిళకు అప్పగించారు. స్థానికుల కథనం ప్రకారం..

మహబూబా బాద్ పట్టణ శివారు రామచంద్రాపురం కాలనీకి చెందిన మహిళా పత్తిపాక లక్ష్మి మానుకోట నుంచి ఇల్లందు వెళ్లేందుకు ఆదివారం స్థానిక డిపో బస్సు ఎక్కింది. అందులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆమె వేరే బస్సులో వెళ్దామని బస్సు దిగింది. ఈ క్రమంలో లక్ష్మీచేతిలో ఉన్న పర్సు బస్సులో పడిపోయింది. ఇంతలో బస్సు ఇల్లందుకు బయలు దేరింది.

అదే బస్సులో ప్రయాణిస్తున్న బయ్యారానికి చెందిన రజిత, జహీరాబాద్‌కు చెందిన షాహినా బస్సులో కింద పడ్డ పర్సును గమనించి దానిని తీసి విధుల్లో ఉన్న డ్రైవర్ ధారవత్ సూర్య, కండక్టర్ డి. నాగరాజుకు అందజేశారు. కాగా లక్ష్మి పర్సు బస్సులో పడి ఉండవచ్చని గుర్తించి వెంటనే బస్టాండ్ నుంచి ఆటో సాయంతో బస్సు వెంట బయలుదేరగా పట్టణంలోని ఇల్లందు బైపాస్ వ్యవసాయ మార్కెట్ వద్ద బస్సును దాటి వేసి ఆటోను నిలిపారు. వెంటనే బస్సును ఆపడంతో తన పర్సు పోయిన విషయాన్ని చెప్పారు. వెంటనే డ్రైవర్, కండక్టర్‌లు సదరు పర్సును పత్తిపాక లక్ష్మికి ప్రయాణికుల సమక్షంలో అందించారు. అందులో నాలుగు తులాల బంగారు ఆభరణం, నగదు ఉందని, తన పర్సు అప్పగించిన ఆర్టీసీ సిబ్బందికి, తోటి ప్రయాణికులకు లక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


నర్సంపేట శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం


గర్భగుడిలోని అయ్యప్పస్వామి


నర్సంపేటలోని అయ్యప్ప దేవాలయంలో మాలలు వేసుకున్న భక్తులు

తెలంగాణ శబరిమల.. నర్సంపేట

- శరణు ఘోషతో వెలుగొందుతున్న ఆలయం
- ఏటా వేలాది మంది భక్తుల మాలాధారణ
- శబరిమల తరహాలో సాగే పూజలు

నర్సంపేట / నర్సంపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చిందంటే వేలాది మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరిస్తుంటారు. ఓ వైపు శైవక్షేత్రాలు.. మరోవైపు అయ్యప్ప ఆలయాలు మాలధారుల శరణుఘోషతో మారుమోగుతుంటాయి. పల్లెలు, పట్టణాలు పడి పూజలతో పరవశిస్తుంటాయి. ఈ క్రమంలోనే నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయం తెలంగాణ శబరిమలగా విరాజిల్లుతోంది. నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గూడూరు మండలాలకు చెందిన వేలాది మంది భక్తులు కార్తీక మాసంలో ఈ ఆలయంలో అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. నవంబరు, డిసెంబరు నెలల్లో అయ్యప్ప దీక్షాపరు లతో.. నిత్యపూజలతో ఆధ్యాతిక సందడి ఉంటుంది. నర్సంపేట పట్టణంలోని వరం గల్ రోడ్‌లో రెండున్నర దశాబ్దాల క్రితం మహేశ్వరం గ్రామానికి చెందిన దివంగత శింగిరికొండ రామాంజనేయులు, దాతల సహకారంతో నిర్మించిన శ్రీధర్మ శాస్తా అయ్యప్ప స్వామి దేవాలయం భక్తుల కొంగుబంగారమై విలసిల్లుతోంది.

దీక్షలు స్వీకరిస్తున్న వందలాది భక్తులు

కార్తీక మాసం ప్రారంభం నుంచి నిత్యం వందల సంఖ్యలో భక్తులు అయ్యప్ప దీక్షలను స్వీకరిస్తుండగా గత రెండు రోజుల్లో సుమారు 640 మంది భక్తులు మాలను ధరించారు. వీరికి ఆలయ అర్చకులు దినేశ్‌మిశ్రా, బ్రాంచు మాలధారణ చేస్తారు. కార్తీక పౌర్ణమి శుక్రవారం ఒక్కరోజే 170 మంది భక్తులు దీక్ష స్వీకరించారు. ఇలా మాలాధారణ స్వీకరించిన భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో అయ్యప్పస్వామి ఆలయంతో పాటు పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయం, మాధన్నపేట రామలింగేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వర ఆలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తుండడంతో పట్టణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగుతోంది. ఇక ఎక్కువశాతం మంది మాలధారులు మకర సంక్రాంతి రోజున శబరిమలైకి వెళ్లి మకర జ్యోతిని దర్శించుకొని ఇరుముడిని అప్పగించి 41 రోజుల దీక్షను విరమిస్తారు.

అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

41 రోజుల పాటు కఠిన నియమాలతో ఆచరించే అయ్యప్ప దీక్ష ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాకుండా ఆరోగ్యాన్ని సైతం పెంచుతుంది. దీక్షా కాలంలో నిష్టతో క్రమ పద్ధతిలో జీవనం సాగించడం, సాత్వికాహారం భుజించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఉదయం చన్నీటి స్నానంతో ఏకాగ్రత పెరగడంతో పాటు ఉష్ణం నుంచి తలకు ఉపశమనం కలుగుతుంది.

దీక్షాపరులు మితాహారం తీసు కోవడం వల్ల శరీరం తేలికగా ఉండడంతో పాటు వ్యాధులు దూరమవుతాయి. వంటల్లో వెల్లుల్లి, ఉల్లిపాయ, అల్లం వంటి మసాల దినుసులు ఉపయోగించకపోవడం వల్ల తిన్న ఆహారం తేలికగా జీర్ణమవుతుంది. ఇలా మాలాధారణతో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యం పెంపొందించుకోవచ్చు. అలాగే పలు వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా మనస్సును నియంత్రణలో పెట్టుకోవచ్చని చెబుతున్నారు.

శబరిమల తరహాలో పూజలు

కేరళలోని శబరిమల తరహాలో నర్సంపేట అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శబరిమలలో జరిగే ఉత్సవ బలి, క్షేత్ర బలి, పల్లివేట, పంబారట్టు, దివ్య పడిపూజ లాంటివన్నీ ఇక్కడి గురుస్వాములు, తాంత్రికవేత్తల ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతాయి. ఆలయం నుంచి ఊరేగింపుగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని మునిసిపాలిటీ ఆవర ణలోని మైదానం వరకు తీసుకెళ్లి పల్లివేట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అలాగే పట్టణంలోని కమలాపురం సమీపంలోని మాధన్న పేట చెరువులో అయ్యప్పస్వామి పంబారట్టు, జలక్రీడ, అభి షేక పూజలు సందడిగా చేపడతారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది మాలాధారులు, ప్రజలు తరలివస్తారు. ఇక్కడ మండల కాల ప్రారంభం రోజు నుంచి 41 రోజుల పాటు నిత్యా న్నదానం కొనసాగుతుంది. అలాగే రాత్రి వేళల్లో అయ్యప్ప స్వాములు బస చేయడానికి ఆల యంలో వసతులు కల్పిస్తారు.

పంట కొయ్యలను కలియదున్నాలి

డీఏవో కె.అనురాధ


డీఏవో అనురాధ

వరంగల్ వ్యవసాయం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంటలు చేతికొచ్చిన తర్వాత వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, వేరుశనగ కొయ్యలను కాల్చొద్దని, తద్వారా వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం దెబ్బ తింటుందని వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.అనురాధ సూచిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంట కొయ్యలను ఆదే పొలాల్లో కలియ దున్నితే భూసారం పెరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. అంతేగాకుండా కొయ్యలను సాగు భూముల్లో కాల్చడం వల్ల వచ్చే సమస్యలను అందులో సూచించారు.

కాల్చడం వల్ల ఇబ్బందులు

- పర్యావరణ కాలుష్యకారకాలైన సీవో, సీవో 2, ఎన్-2 ఓ, ఎస్-2ఓ విడుదలై పంట దిగుబడి తగ్గుతుంది.
- గాలి నాణ్యత తగ్గుతుంది. భూసారం క్షీణిస్తుంది. నత్రజని కార్బనస్థాయి తగ్గుతుంది. ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, కీటకాలు చనిపోతాయి.
- భూమిలో నత్రజనితో పాటు భాస్వరం, పొటాషియం, సల్ఫర్ స్థాయిలు తగ్గిపోతాయి.
- వరి గడ్డిని కాల్చడం వల్ల వెలుబడే మీథెన్ వాయువుల ద్వారా ఓజోన్ పొర దెబ్బ తిని వాయుకాలుష్యం పెరుగుతుంది. తద్వారా మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.
- పంట అవశేషాలను కాల్చడం ద్వారా పశుగ్రాసం కొరత ఏర్పడి పశుపోషణ భారం అవుతుంది. ఫలితంగా పాల ఉత్పత్తుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

పంట అవశేషాల ఉపయోగాలు

- పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది కొయ్యలను వంట చెరుకుగా వాడుకోవచ్చు.
- సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు. పుట్ట గొడుగుల సాగు కోసం ఉపయోగించవచ్చు.
- నేలలో కలియ దున్నడం వల్ల కార్బన స్థాయి పెరుగుతుంది.
- నేల మీద మల్చ్‌గా ఉపయోగించవచ్చు.

నేలలో కలియ దున్నితే..

పంట కొయ్యలను నేలలో కలియదున్నితే సేంద్రియ కార్బనం పెరుగుతుంది. తద్వారా సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి నత్రజనితోపాటు ఇతర పోషకాల లభ్యత పెరుగుతుంది. నేలలో కలియ దున్నడానికి వరిలో అయితే మల్చర్, పత్తిలో అయితే శెడ్డర్ వాడుకోవాలి. దీని వల్ల పంట వ్యర్థాలు నేలలో కలిసిపోయి నేల సామర్థ్యం పెరుగుతుంది. కాగా, వ్యర్థ డీకంపోజర్ లేదా పూసా డీకంపోజర్, లేదా పీజేటీ ఎస్‌ఏయూ కన్సార్టియం ద్వారా వరి గడ్డిని త్వరగా కుళ్లబెట్టవచ్చు.

పాలాల్లో పంట వ్యర్థాలను కాల్చివేసిన దృశ్యం (ఫైల్)


దక్షిణ అమెరికా టు భారత్

- టమాటాలో టూటా అబ్సొల్యూటా పురుగు ఉధృతి
- సమగ్ర సస్య రక్షణ


టమాటా పంటను పరిశీలిస్తున్న ఎస్బార్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

హసన్‌పర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం టమాట పంటలో ఆకుతొలుచు (టూటా అబ్సొల్యూటా) పురుగు ఉధృతి పెరిగింది. ఇది దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందిన పురుగు. క్రమేనా భారతదేశానికి విస్తరించి 2014లో మహారాష్ట్రలోని పుణేలో మొదటిసారిగా, 2015లో కర్ణాటకలోని గుత్తి ప్రాంతాల్లో గుర్తించబడింది. ప్రస్తుతం భారతదేశం అంతా విస్తరించి, టమాట రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ పురుగు అన్ని లార్వా దశలు మొక్క అన్ని భాగాలైన కొమ్మలు, ఆకులు, పువ్వులు, పండ్లను తిని పంట ఉత్పత్తి, నాణ్యతను గణనీయంగా తగ్గిస్తాయి.

పురుగు దాడి వలన ఆకులు మాడిపోవడం, మొక్కల ఎదుగుదల తగ్గిపోవడం, కాయ, పండ్లపై చిన్న రంధ్రాలు ఏర్పడడం, ఈ రంధ్రాల ద్వారా ఇతర వ్యాధి కారక జీవులు పండ్లలో చొరబడి, పండ్లు కుళ్లిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సరైన పద్ధతులు పాటించకుండా సమయానికి నివారించకపోతే పూర్తి పంట నష్టపోయే అవకాశం ఉంది.

సమగ్ర సస్య రక్షణ చర్యలు

- పంట కోసిన తరువాత పొలాన్ని దున్ని కనీసం రెండు నెలల పాటు ఎండనివ్వాలి. దీని వల్ల పురుగు వివిధ దశలో నశిస్తాయి.
- పురుగు ఆశించిన మొక్కలను ఏరి నాశనం చేసుకోవాలి.
- సోలనేసి జాతి పంటలు వేసుకోకుండా ఇతర జాతి పంటలు వేసుకోవాలి.
- నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి.
- ప్రధాన పొలానికి ఎకరానికి 200 కేజీల వేప పిండిని వేసుకోవాలి.
- నారును నాటుకునే సమయంలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ.ను ఒక లీటరు నీటికి కలిపి వేర్లను ముంచి నాటుకోవాలి.
- పురుగుల పర్యవేక్షణ కోసం 2 నుంచి 3 ట్యూటాలూర్ లింగాకర్షక బుట్టలను ఎకరానికి అమర్చుకోవాలి.
- వేప నూనె 5 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- గుడ్డు పరాన్న జీవి అయిన ట్రైకోగ్రామ్మా ప్రిటియోసం, ట్రైకోగ్రామ్మా అకియా ఎకరానికి 45వేలను వారానికి ఒకసారి వాడుకోవాలి.
- నారు నాటిన 45 రోజులకి క్లోరాన్‌ట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.15 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- చివరిలో బ్రోఫ్లానిలైడ్ 0.15 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపి ఉపయోగించినా మంచి ఫలితాలు ఉంటాయి.

సరైన సమయంలో చర్యలు తీసుకుంటేనే అధిక దిగుబడులు


ఎస్బార్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ లాల్‌సింగ్ రాథోడ్



టమాట పంటలో వచ్చే ఆకుతొలుచు (టూటా అబ్సొల్యూటా) పురుగు ఆడరెక్కల పురుగు సుమారుగా 300 గుడ్లను పెట్టి, 25 నుంచి 30 రోజులలో తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటుంది. ఈ పురుగు దాదాపు మొక్క అన్ని భాగాలపై ఆశించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించి దిగుబడి పంట నాణ్యతను తగ్గిస్తుంది. దీని ఉధృతిని తగ్గించేందుకు సరైన సమయంలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందవచ్చు.

కలికితురాయి.. కళాక్షేత్రం!

- ఆకట్టుకునే రీతిలో ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ
- ఈనెల 19న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశేషాలు
- ప్రాంగణంలో కాళోజీ విగ్రహం ఏర్పాటు


ఆవిష్కరణకు సిద్ధం చేసిన కాళోజీ విగ్రహం

హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 4.24 ఎకరాల స్థలం.. రూ.95కోట్ల వ్యయంతో నిర్మించిన కాళోజీ కళా క్షేత్రం అద్భుత కట్టడం ఓరుగల్లు కీర్తికిరీటంలో కలికితురాయిగా నిలవనున్నది. ఆధునిక, ప్రాశ్చాత్య డిజైన్ల మేళవింపుతో రూపుదిద్దుకున్న ఈ కళా క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోని అద్భుత కట్టడాల్లో ఒకటిగా నిలవనున్నది. వరంగల్ సాహిత్య, సాంస్కృతిక, నాటక, కళారంగాలకు వేదికగా నిలవనున్నది. ఈ కళాక్షేత్రం కాళోజీ ఆశలు, ఆకాంక్షలు, ఆయన దిక్కార స్వరానికి ప్రతీకగా నిలవనున్నది. నాలుగు అంతస్తుల భవనంలో 1.77 చదరపు అడుగుల భవనం వైశాల్యంలో నిర్మాణం సాగింది. ప్రధాన ఆకర్షణగా ఆడిటోరియం నిలవనుంది. 1,127మంది కూర్చునే సామర్థ్యం ఉంది. ఆధునిక హంగులతో సాహిత్య, సాంస్కృతిక, నాటక కళా ప్రదర్శనలు నిర్వహించేందుకు వీలుగా ఆడిటోరియంతో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం సాగింది. ప్రీ ఫంక్షన్ లాబీని, చిన్న తరహా సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహించేందుకు వీలుగా మినీ హాల్స్ కూడా నిర్మించారు.

పూర్తి ఎయిర్ కండీషన్ కలిగిన ఈ భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో కాళోజీ జీవిత చరిత్రను, ఆయన రచనలను, ఛాయాచిత్రాలను మనముందుంచే ఆర్ట్‌గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు. కాళోజీ అధ్యయన కేంద్రాన్ని కూడా ఇందులో ఏర్పాటు చేయబోతున్నారు. కాళోజీ ఫౌండేషన్ వారి కోసం ప్రత్యేకంగా రెండు గదులను కూడా ఇందులో కేటాయిస్తున్నారు. కళాక్షేత్రం ప్రాంగణంలో కాళోజీ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. క్షేత్రం ముందు పచ్చని పచ్చిక బయలును అభివృద్ధి చేశారు. ఫౌంటేన్లు, ఇతర కళాకృతులతో అందంగా తీర్చిదిద్దారు.

ప్రారంభోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళాక్షేతానికి ప్రారంభోత్సవం చేస్తారు. కాళోజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

ప్రారంభోత్సవం సందర్భంగా కాళోజీ జీవితంపై అలాగే కళాక్షేత్రం విశిష్టతలను తెలిపే ఒక షార్ట్ ఫిల్మ్‌ను కూడా ప్రదర్శిస్తారు. సీఎం ఆర్ట్ గ్యాలరీని, ఇతర విభాగాలను సందర్శిస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులు హాజరవుతారు.


కళాక్షేత్రంలో కాళోజీ ధరించిన దుస్తులు, చెప్పులు, ఉపయోగించిన చేతికర్ర, టేబుల్, కుర్చీ


కాళోజీ నారాయణ రావు జీవిత విశేషాలను తెలియజేసే ఛాయా చిత్రాలు ఉన్న గ్యాలరీ

పదేళ్ల కిందట అంకురార్పణ

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమైన కొత్తలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు స్మారకార్థం ఒక అద్భుత స్మారక మందిరాన్ని నిర్మించాలని సంకల్పించారు. కాళోజీ కళాక్షేత్రం పేరుతో హనుమకొండ బాలసముద్రం రోడ్డులో హయగ్రీవచారి కాంపౌండ్ స్థలంలో 4.20 ఎకరాల్లో ఈ భవ్యమైన భవన నిర్మాణానికి ఎంతో అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అప్పట్లోనే ఈ ప్రాజెక్టు పూర్తికి బడ్జెట్‌లో రూ.52కోట్లు ప్రతిపాదించారు. రూ.10కోట్ల చొప్పున విడతల వారీగా నిధుల విడులకు జీవో కూడా జారీ అయింది. మొదట్లో దీని నిర్మాణ బాధ్యతలను ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ మధ్యలోనే విరమించుకోవడంతో దీనిని పూర్తిచేసే బాధ్యతను రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చేపట్టింది. నిధులు లేక పనులు నత్తనడకన సాగాయి.

మధ్యలో కరోనా కాలంలో పనులు రెండేళ్లపాటు పూర్తిగా నిలిచి పోయాయి. ఏళ్లు గడుస్తున్నా కళాక్షేత్రం పనులు పూర్తికాలేదు. పర్యాటక సంస్థ కూడా నిధుల లేమితో చేతులెత్తేసింది.

దీనిని పూర్తి చేసే బాధ్యత చివరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ భుజాన పడింది. ఆ సంస్థ తన అంతర్గత వనరులతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వచ్చిన నిధులతో ఎట్టకేలకు రూ.95 కోట్లతో కళాక్షేత్రం పూర్తయింది. రూ.50 కోట్లతో పూర్తి కావలసిన భవనం పనుల్లో జాప్యం వల్ల అంచనా వ్యయం రూ.95 కోట్లకు చేరింది.

రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు

- సుస్థిరమైన జీవనోపాధికి సోపానాలు
- ఉమ్మడి జిల్లాలో 91 సంఘాలు
- సహకార వారోత్సవాలు ప్రారంభం

హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. సహకార వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కార్యాచరణను రూపొందించారు. అధికారులు సహకార సంఘాల బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వారం రోజులు రోజుకొక కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఏ రోజు ఏ కార్యక్రమాన్ని నిర్వహించాలనే విషయంలో షెడ్యూల్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమాల వివరాలను అన్ని సహకార సంఘాలకు పంపించారు. గురువారం అన్ని సహకార సంఘాల కార్యాలయాల ఎదుట సహకార పతాకాలను ఎగురవేశారు. అనంతరం సహకార సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. సహకార సంఘాల బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తొలిరోజు సహకార వారోత్సవాల్లో పాల్గొన్నారు. సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట దర్గాలో...

కాజీపేట దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార ఉద్యమాన్ని బలపరచడం- సహకార మంత్రిత్వ శాఖ చొరవ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఊకంటి వనంరెడ్డి ముందుగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. నోడల్ అధికారి యమున, సంఘం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. సహకార సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

రైతుల సేవలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 91 పీఏసీఎస్ ఉన్నాయి. వీటి పరిధిలో లక్షా 20 వేల మంది సభ్యులు ఉన్నారు. పీఏసీఎస్‌లు పల్లెల్లోని రైతులకు పట్టుగొమ్మలాంటివి. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంఘాలు రైతులకు ఉత్తమ సేవలందిస్తున్నాయి. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలందిస్తున్నాయి. ధాన్యం కొనుగోలుతో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణను చేపడుతున్నాయి. విదేశాల్లో చదివే రైతుల పిల్లలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాయి. తక్కువ వడ్డీకే బంగారు రుణాలను అందిస్తూ రైతులను ఆదుకుంటున్నాయి.

పునర్విభజన ఎప్పుడో ?

సహకార సంఘాలను పునర్విభజించాలన్న డిమాండ్ చాలా కాలంగా వినిపిస్తోంది. మూడు దశాబ్దాల క్రితం పీఏసీఎస్‌లు ఏర్పడ్డాయి. వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడే సహకార సంఘాల సేవలు అందుబాటులోకి రావాలంటే వాటిని విభజించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కొత్తగా 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలని రైతులు కోరుతున్నారు. ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యులు ఉండగా ఏ అవసరం వచ్చినా క్యూ కట్టాల్సి వస్తోంది. మొదట్లో 250కిపైగా సొసైటీలు ఉండేవి. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంఘాలను బలోపేతానికి ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంఘాలను బలంగా ఉన్న సంఘాల్లో విలీనం చేశారు. దీంతో సంఘాల స సంఖ్య 91కి తగ్గిపోయింది. అప్పటి నుంచి సహకార సంఘాల విస్తరణ జరగలేదు. ఈ మధ్య కాలంలో ఉమ్మడి జిల్లా పెరిగింది. రైతుల అవసరాలు పెరిగాయి. జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన జరిగింది కానీ రైతుల అవసరాలకు తగ్గట్టు పీఏసీఎస్‌ల పునర్విభజన, కొత్త సంఘాల ఏర్పాటు జరగలేదు.

దూరాభారం..

రైతులు ప్రతి పంట సీజన్‌లో రుణాలు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. కొందరు రైతులు కొత్త రుణాలు తీసుకుంటారు. వాటి కోసం దూరంగా ఉన్న సొసైటీలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో తక్కువ గ్రామాలుండగా మరి కొన్ని సొసైటీలకు ఎక్కువ గ్రామాలున్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న సొసైటీలకు వివిధ పనులకు రైతులు వెళ్లి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రుణాల కోసం, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో రాజకీయ చైతన్యం, పలుకుబడి గల మండలాలు చిన్నవైనా రెండు మూడు సొసైటీలు ఉన్నాయి.


కాజీపేట దర్గా పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, రైతులు

సహకార వారోత్సవాలు

గురువారం కాజీపేట దర్గా పీఏసీఎస్‌లో తొలి రోజు సహకార వారోత్సవం నిర్వహించారు. ఈ నెల 15న ధర్మసాగర్ పీఏసీఎస్‌లో సహకార రంగంలో ఆవిష్కరణలు, సాంకేతిక, మంచి పరిపాలన అంశంపై, 16న కమలాపూర్‌లోని పీఏసీఎస్‌లో వ్యాపారవేత్తలు, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర అంశంపై, 17న ఎల్కతుర్తిలోని పీఏసీఎస్‌లో సహకార వ్యాపారాల్లో మార్పు అంశం, 18న పెంచికలపేట పీఏసీఎస్‌లో సహకార సంస్థల మధ్య సహకారాన్ని బలపరచడం, 19న నందనం పీఏసీఎస్‌లో మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంస్థలు, 20న వంగపహాడ్‌లోని పీఏసీఎస్‌లో సుస్థిర అభివృద్ధి సాధించడంలో సహకార సంస్థల పాత్ర, మెరుగైన ప్రపంచం కోసం ముందడుగు అనే ఇతివృత్తాలపై కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మల్టీ సర్వీసు సెంటర్లుగా పీఏసీఎస్‌లు

మార్నేని రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్



సహకార సంఘాల ఆర్థిక బలోపేతానికి కొత్త పంథాలో చర్యలు చేపట్టాం. రాష్ట్రంలోనే తొలి సారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంఘాల బలోపేతం కోసం మల్టీ సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేశారు. సంఘాలు కేవలం రుణాలకే పరిమితం కాకుండా స్వతహాగా ఆర్థిక ఉన్నతి సాధన కోసం మల్టీ సర్వీసు సెంటర్లు ఉపయోగపడు తున్నాయి. సంఘాలు మల్టీ సర్వీసు సెంటర్లుగా రూపుదిద్దుకోవడం ద్వారా పెట్రోల్ పంపులు, ఫంక్షన్ హాల్‌లు, ధాన్యం నిల్వల కోసం గోదాముల నిర్మాణం, షాపింగ్ మాల్స్ ఇలా 120 రకాలుగా సంఘాలు వ్యాపార కేంద్రాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మారాయి. వివిధ వ్యాపారాలను సంఘాలు నిర్వహించడం ద్వారా సొంతంగా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్నాయి.

ఎంఎస్‌సీల నిర్వహణతో ఉమ్మడి వరంగల్ జిల్లా మోడల్‌గా నిలిచింది. సంఘాల బలోపేతానికి అనేక రకాల్లో చర్యలు చేపట్టి ఫలితాలు సాధిస్తున్నాం. సహకార సంఘాలు కేవలం రైతుల రుణాలకే పరిమితం కాకుండా కమర్షియల్ బ్యాంకుల్లాగా సేవలు ఉన్నతీకరణను పొందాయి. అనేక రకాల రుణాలందిస్తున్నాయి. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ, సంఘాలకు నాబార్డ్ ద్వారా ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావడం, సహకార విశ్వ విద్యాలయం ఏర్పాటు ప్రణాళికతో ఉన్నాం.

వైభవంగా పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన



పోతరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

దేవరుప్పుల, నవబంరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దమడూరులో ఆదివారం పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన, శ్రీ కంఠ మహేశ్వరస్వామి హోమ పూజ వైభవోపేతంగా జరిగింది. ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిళలు జలకడవలతో పోతరాజులకు జలాభిషేకం చేశారు. వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. శ్రీ కంఠ మహేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు ప్రత్యేకపూజలు చేసి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు పోతరాజులను, శ్రీ కంఠమహేశ్వరస్వామిన దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆతర్వాత అన్న ప్రసాతం జరిగింది. అలయ నిర్మాణం, అభివృద్ధి, పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ దంపతులను గ్రామ గౌడ కులస్థులు. గ్రామస్థులు సన్మానించి సత్కరించారు.

కార్యక్ర మంలో పెద్దగుంటి, చిన్నగుంటి పెద్దలు గొడిషాల భిక్షపతి, మామిండ్ల రాములు, పెదగోని శ్రీనివాస్, కారుపోతుల నారాయణ, గోపా జనగామ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటయ్య, తీగల దయాకర్, బస్వ మల్లేశం, కోతి ప్రవీణ్, తీగల సత్యనారాయణ, పరీదుల భాస్కర్, నాగరాజు, వడ్లకొండ వినయ్, చంద్రగిరి సంపత్, సోమన్న, తండా రమేష్ పాల్గొన్నారు.

21న శివలింగ ప్రతిష్ఠాపన

కొడకండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏడునూతులలోని పంచముఖ నాగేంద్రస్వామి ఆలయంలో 21న శివలింగ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పాము లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 20న గణపతి పూజ, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠతో ప్రారంభమై 21న శివలింగం, నంది విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుందని అనంతరం మహా అన్నదానం ఉంటుందని తెలిపారు.

ఆధ్యాత్మికం



మార్కండేయుడికి హోమపూజ

చిలుపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నపెండ్యాలలో నిర్మించిన భక్త మార్కండేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా, ఆదివారం హోమపూజను నిర్వహించారు. రెండో రోజు ఆవాహిత దేవత హవనం, నమక చమక పురుష సూక్త, కళాన్యాస హవనం, తదితర పూజలను పూజారి యల్లంభట్ల కరుణాకర్ శర్మ నిర్వహించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గజ్జెల దామోదర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, మంద రాజమౌళి మాట్లాడుతూ, రేపు (సోమవారం) నిర్వహించే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్థులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గజ్జెల రాజేశ్, ఆమంచ జ్ఞానేశ్వర్, గుర్రపు వెంకటేశ్వర్లు, రాంబాబు, యుగేందర్ రాజు, సామల రాములు, నేలపోగుల రఘునాథ్, గుర్రపు రమేష్, కనుకుంట్ల యాదగిరి, నారాయణ, బండారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తొలగించాలి

లింగాలఘణపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రహదారుల వెంట ఆరబెట్టిన ధాన్యం రాశులను రైతులు వెంటనే తొలగించాలని లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని నెల్లుట్ల నుంచి వనపర్తి వరకు జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం కుప్పలను పరిశీలిం చిన ఎస్సై శ్రవణ్‌కుమార్ సంబంధిత రైతుల తో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనదారుల ప్రాణాలకు పెనుప్రమాదం పొంచి ఉందని తద్వారా ఏదేని ప్రమాదం జరిగితే బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ధాన్యం ఆరబెట్టడానికి రోడ్లను ఎట్టిపరిస్థితుల్లో వాడుకోవద్దని ధాన్యం రాశుల కారణంగా నిండు ప్రాణాలు పోతే తిరిగి రావని సూచించారు. 24 గంటల్లో రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాశులను తొలగించాలని సూచించారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

పాలకుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావి వద్దకు రైతు వెళ్తుండగా ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన అయ్యంగారిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రైతు నారాయణ తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎలుగుబంటి దాడి చేసింది. అదే సమయంలో పెంపుడు కుక్కలు అరవడంతో ఎలుగుబంటి పారిపోయింది. అప్పటికే నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరంగల్ తరలించి చికిత్స అందస్తున్నారు. గత వారం రోజులుగా ఎలుగుబంటి ఈ ప్రాంతంలో సంచరిస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చిలుపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డ ఘటన చిన్నపెండ్యాలలో ఆదివారం జరిగింది.స్థానికుల కథనం ప్రకారం. హన్మకొండ జిల్లా వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన కరెట్లపల్లి ధర్మారావు స్టేషన్‌ఘన్‌పూర్ వెళ్లి, తిరుగు పయనంలో చిన్నపెండ్యాల వైపు ద్విచక్రవాహనంపై సర్వీస్‌రోడ్డు మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీకాలనీకి చెందిన సింగపురం రాజేష్ చిన్నపెండ్యాల నుంచి రాంగ్ రూట్‌లో సర్వీస్‌రోడ్డు మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌లు అదుపు తప్పడంతో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ధర్మారావుకు కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా, రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీకి మోక్షం



గురుకులానికి ఏర్పాటు చేసిన ప్రహరీ

పాలకుర్తి,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ కూలిపోయి మూడేళ్లవుతున్నా ఎట్టకేలకు అధికారులు స్పందించారు. జూలై 29న ప్రహరీ కూలి మూడేళ్లు ... నిర్మాణానికి ఇంకెన్నేళ్లు అని శీర్షికన ప్రచురించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఇటీవల గురుకుల పాఠశాలను సందర్శించి ప్రహరీ కూలిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రూ.4లక్షలు నిధులు మంజూరి ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య అన్నారు. నవంబరు 21న ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు వాల్ పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌వద్ద జెండా ఎగురవేసి ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకోవాలన్నారు. బీసీ-డిలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని, ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నీల రాజు, చినబోయిన రేఖ, రాజు, సదానందం, నిమ్మల స్వామి, చిక్కుడు రాములు, పెద్ది వెంకటయ్య, ఉప్పలయ్య తదితనేలే పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సోమన్నకు అరుదైన పురస్కారం



బచ్చన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు పెనుగొండ సోమన్నకు అరుదైన పురస్కారం లభించింది. గ్లోబల్ ఇండియా ఆఫ్ ఆర్గనైజేషన్, స్కైలైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు సంయుక్తంగా 2024 సంవత్సరానికి టీచర్ ఇన్స్పిరేషన్ అవార్డుతో సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సోమన్న గత 24 సంవత్సరాలుగా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు, పనిచేసిన ప్రతిచోట దాతలతో సహకారంతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయటం, విద్యార్థుల్లో విద్యతో ఇష్టం పెరిగేలా కృత్యాధారబోధనకు ప్రాముఖ్యత కల్పిస్తూ విద్యార్థులు రాణించేలా కృషి చేసినందుకు ఈ గుర్తింపు లభించింది. ఇటీవల సోమన్నకు టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డును శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు అందించారు.

మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

తొర్రూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆసంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ అన్నారు. ఆదివారం తొర్రూరులోని విశ్రాంతి భవనంలో ఈనెల 21న నిర్వహించే ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ దినోత్సవం రోజున ముదిరాజ్ మహాసభ జెండా ఎగురవేసి ఐక్యత చాటుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ముదిరాజ్‌లను బీసీ-డి నుండి బీసీ-ఏలోకి మారుస్తామని హామీ ఇచ్చారని, హామీకి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణానికి సహకరిస్తా

రాయపర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలారంలో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరిస్తానని బీఆర్ఎస్ నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గ్రామ రెడ్డి సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

సీఎం బహిరంగ సభను సక్సెస్ చేయాలి: కొమ్మూరి



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 19న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జనగామలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500.లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామన్నారు. సంవత్సరం కాలంలోనే నిరుద్యోగులకు 50వేల ఉద్యోగాలను అందించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా ఆరు గ్యారంటీలను అమలుపరుస్తుం దన్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 9వరకు ప్రజా విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఈనెల 19న వరంగల్‌లో జరుగబోయే ప్రజావిజయోత్సవసభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నందున నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ నాయక్, రాజమౌళి, బనుక శివరాజ్ యాదవ్, చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, బడికె ఇందిర తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించండి'



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

జనగామ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలతోపాటు సామాజిక సమస్యలపై నిరంతరం పనిచేసిన నిచేస్తూ ఆదర్శ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి పనితీరు ఉందని, ఆయన్ను మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. ఆదివారం జనగామలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మండలిలో అనేక అంశాలపై పోరాడినట్టు తెలిపారు.సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసిన నర్సిరెడ్డిని మళ్లీ పోటీలో నిలుపుతున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమా ర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కందుల శ్రీనివాస్, రవీందర్, మల్రెడ్డి, రాము, నీల కంఠం, సూర్జిత్, మోడల్ స్కూల్ బాధ్యులు శ్రీనివాస్, బాలమురళి, సోషల్ వెల్ఫేర్ బాధ్యులు సైదాబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న బాల్యమిత్రులు

బాల్యమిత్రుల చేయూత

లింగాలఘణపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చీటూరు జడ్పీ హైస్కూల్ 1992-93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన సయ్యద్ ఖలీల్ ఇటీవల మృతిచెందగా బాల్యమిత్రులు మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఈమేరకు ఆదివారం రూ.31వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఐలేని రాంరెడ్డి, కాసోజు రాజు, ఐల బీరయ్య, సావిల్ల అంజయ్య, మడికంటి పరశురాములు, నకీర్త వెంకన్న, సావిళ్ల చందర్‌రావు, సీహెచ్ నర్సింహులు, శ్రీనివాస్, అంజన్న, కుమార్, సానికె శ్రీనివాస్, బ్రహ్మాచారి, సురేశ్, కృష్ణమూర్తి, ఆగమల్లు, సిద్ధారెడ్డి, యాదగిరి, రామగిరి మధు, సామల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఏపీ ధర పెంపును ఉపసంహరించుకోవాలి

జనగామ కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డీఏపీ ధర పెంపును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కోట్లాదిమంది రైతులు దేశంలో వ్యవసాయ రంగాన్ని వదిలేసి పట్టణ ప్రాంతాలకు వలస వస్తూ కుటుంబాలను పోషించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వంలోని మోదీ నయవంచక పాలన వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని, దేశాన్ని కుదేలు చేస్తుందన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామన్న బీజేపీ ప్రభుత్వం భారీగా డీఏపీ ధర పెంచడం సరికాదన్నారు. ప్రస్తుతం రూ.1350.లు ఉన్న ధర రూ.1650 పెంచడం సిగ్గుచేటన్నారు. డీఏపీ బస్తాపై రూ.300 పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

చిలుపూర్, నవంబరు 17: గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పల్లగుట్టలో డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పల్లగుట్ట జీపీ పరిధిలోని 10వ వార్డులో, స్టేషన్‌ఘన్‌పూర్ వెళ్లే మార్గంలో మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రెయినేజీ అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో మురుగునీరంతా రోడ్డుపై చేరి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. తద్వారా కాలనీవాసులంతా ఈగలు, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు వేల్పుల అనూష, మౌనిక, దేవులపల్లి కుమారస్వామి, వేల్పుల అజయ్, బండి రమ, రక్షిత, బండి శ్రీశైలం, నర్సయ్య, ముక్కెర రామస్వామి, వేల్పుల అశోక్ పాల్గొన్నారు.



మురుగునీటిని పరిశీలిస్తున్న శ్రీనివాస్



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నేతలు

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కావాలి

జఫర్‌గడ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని టీడీపీ నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్, ప్రతినిధి పుట్ట రజినీకాంత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం వారు జఫర్‌గడ్‌లో పార్టీ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సంసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ చేపట్టిన సభ్యత్వ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు.

కార్యకర్తల సంక్షేమం కోసం రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రేణులు సమిష్టిగా పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు చవనబోయిన సోమనర్సయ్య, నాయకులు గట్టు ప్రసాద్ బాబు, మేకల రమేశ్, ధర్మారెడ్డి, శ్రీనివాస్, కలకోట రమేశ్, ఎల్లస్వామి, దామోదర్, భిక్షపతి, కొమురయ్య, ఎల్లయ్య, సారయ్య, నర్సింగం, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

5వ పేజీ తరువాయి

అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తా: కడియం

నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనకి కడియం కోరారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న మహిళ బహిరంగ సభకు ఘన్‌పూర్ నుంచి భారీగా మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతు భరోసాను ప్రభుత్వం త్వరలోనే అందించనుందన్నారు. కార్యక్రమంలో రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు జూలకంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, అంబటి కిషన్‌రాజ్, గడ్డమీది సురేష్, గుర్రపు ప్రసాద్, తీగల కరుణాకర్, బూర్ల శంకర్, కోతి రాములు, ఇనుగాల రాజిరెడ్డి, సింగపురం వెంకటయ్య, తెల్లాకుల రామకృష్ణ, గాదె రమేష్ పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి: ఎర్రబెల్లి

సన్నకారు రైతుల భూములు గుంజు కోవాలని చూస్తోందన్నారు. దీంతో తెలంగాణ సమాజం మొత్తం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తోందన్నారు. సీఎం సొంత జిల్లాలోని తన నియోజకవర్గంలోని రైతులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరగబడ్డారని, కొద్దిరోజుల్లోనే తెలంగాణ మొత్తం రేవంత్ సర్కార్‌పై తిరగబడుతారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. లగచర్ల ఘటనపై కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని దయాకర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గ్రూప్-3 పరీక్షలు షురూ

పట్టించుకోలేదు. ఈ కారణంగా శనిగరం కరుణాకర్ అనే అభ్యర్థితో పాటు పలువురు వికలాంగ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, పరీక్ష కేంద్రాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదివారం పరిశీలించారు. ఏబీవీ జూనియర్ కళాశాల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ పరీక్షల తీరును పరిశీలించారు. కేంద్రం సీఎస్ కనకరాజును ఏర్పాట్లపై, మౌలిక వసతుల కల్పనపై అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట ఆర్డీవో గోపిరాం, తహసీల్దార్ ఇంద్రపల్లి హుస్సేన్ ఉన్నారు. యశ్వంతాపురంలోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఊరడి వేణు అనే అభ్యర్థి ఫొటో తీసుకోవడానికి వెళ్లి వచ్చే సరికి ఆలస్యం కావడంతో లోపలకు అనుమతించలేదు. తొర్రురుకు చెందిన తాటికాయల అమరేందర్, నర్మెట్టకు చెందిన కర్నకంటి రాజు, రఘునాథపల్లికి చెందిన ఉమ్మగాని రాజేష్, జనగామకు చెందిన పొడపాటి వేణుగోపాల్, కొడకండ్లకు చెందిన అరుంధతి ఉదయం 9.32 గంటలకు పరీక్ష కేంద్రానికి రాగా గేట్లు మూసి వేయడంతో వెనుదిరిగిపోయారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయండి: మంత్రులు

బీఆర్ఎస్‌కే ఉందని, ఈ విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ మరిచినా ప్రజలు మరువలేదని మంత్రి సీతక్క విమర్శించారు. ఇతర రాష్ట్రాలో బీఆర్ఎస్ లేనప్పటికీ అక్రమంగా దోచిన సొమ్ముతో రాజకీయం చేసిన చరిత్ర ఆ పార్టీకే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడుతుంటే బీఆర్ఎస్ అడ్డుకుంటోందన్నారు. తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించే కుట్రలు చేస్తోందన్నారు. కులాలు, మతాలు, వర్గాలను రెచ్చగొట్టడమే పనిగా బీఆర్ఎస్ పెట్టుకుందని దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ దుర్మార్గ పాలన సాగిస్తోందని సీతక్క విమర్శించారు. కాంగ్రెస్ దేశాన్ని ఐక్యం చేసేందుకు పోరాడుతోందన్నారు. దేశం కోసం కాంగ్రెస్ పాటుపడుతుంటే బీఆర్ఎస్ అవాస్తవాలు మాట్లాడడం శోచనీయమన్నారు. ఎలాగైనా అధికారం పొందాలనే ధ్యాస తప్ప బీఆర్ఎస్‌కు మరొకటి లేదని విమర్శించారు. జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, సంక్షేమం, నిధుల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వే చేపట్టిందన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం లిమ్కా బుక్ రికార్డుల కోసం ఒక రోజులోనే సర్వే ముగించిందని విమర్శించారు. కనీసం సర్వే వివరాలను కూడా బయటపెట్ట లేదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి కార్యవర్గంలో జిల్లాకు పెద్దపీట

బచ్చన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గంలో జనగామ జిల్లాకు పెద్దపీట వేశారని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దోర్నాల వెంకటేశ్వర్లు (జనగాం) ఉపాధ్యక్షులుగా, మచ్చ నరేందర్ (బచ్చన్నపేట), పసునూరి మధసూదన్ (కొడకండ్ల), మాచర్ల సారయ్య (పాలకుర్తి), పాము మోహన్ (దేవరుప్పుల), చిలువేరు సదానందం (స్టేషన్‌ఘన్‌పూర్), మచ్చ బాల్‌నర్సయ్య (జనగామ)లను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించటం జరిగిందన్నారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శిగా కరిమికొండ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా గజ్జల దామోదర్ (చిన్నపెండ్యాల), గుండు వెంకటేశ్వర్లు (స్టేషన్‌ఘన్‌పూర్), మామిడాల సోమనారాయణ (జఫర్‌ఘడ్)తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్ నియమించటం జరిగిందని బాల్‌రాజు తెలిపారు.



ఎంపికైన వారిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు